సాక్షి
రంగారెడ్డి
మంగళవారం ׀ 17 ׀ డిసెంబర్ ׀ 2024



మొదటి అడుగు

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా 'వన మహోత్సవం' పేరిట మొక్కలు నాటే కార్యక్రమానికి ప్రణాళికలు రచిస్తోంది. 8లో ▸



పట్టించుకోని బీఆర్ఎస్

అధికారంలో ఉన్నప్పుడు సర్పంచులను పట్టించుకోని బీఆర్ఎస్ మొసలి కన్నీరు కారుస్తోందని కాంగ్రెస్ నేతలు అన్నారు. 8లో ▸



రేషన్ బియ్యం పట్టివేత

రేషన్ బియ్యం పట్టుకున్న సంఘటన ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. 8లో ▸

వణికిస్తోంది



మొయినాబాద్ రూరల్: అమ్డాపూర్‌లో చలిమంటలు కాచుకుంటున్న ఓ కుటుంబం

జిల్లాలో రికార్డుస్థాయిలో పడిపోయిన రాత్రి ఉష్ణోగ్రతలు

- ఇబ్రహీంపట్నంలో అత్యల్పం.. ఆమనగల్లులో అత్యధికం
- చలికి గజగజ వణుకుతున్న చిన్నారులు, వృద్ధులు
- పెరుగుతున్న ఆరోగ్య సమస్యలు
- జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్యనిపుణులు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: చలి పంజా విసురుతోంది. ఉత్తరాది నుంచి వీస్తున్న శీతల గాలులతో జిల్లా ప్రజలు గజగజ వణికిపోతున్నారు. గతంలో ఎన్నడూ లేనంతగా ఆదివారం రాత్రి కనిష్ట ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో పడిపోయాయి. ఇబ్రహీంపట్నం మండలం ఎలిమినేడు సహా షాబాద్ మండలం చందనవెల్లిలో అత్యల్పంగా 6.7 డిగ్రీలకు పడిపోగా, మణికొండ సహా ఆమనగల్లులో అత్యధికంగా 17.3 డిగ్రీలు నమోదైంది. అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము వరకు భారీగా మంచు కురుస్తోంది. బీజాపూర్, విజయవాడ, శ్రీశైలం, నాగార్జున సాగర్ జాతీయ రహదారులతో పాటు ఔటర్ రింగ్‌రోడ్డుపై తరచూ రోడ్డు ప్రమాదాలు వెలుగు చూస్తున్నాయి.

తొమ్మిదైనా తొలగని ముసుగు

శీతలగాలులకు మంచు తోడవడంతో చిన్నారులు, వృద్ధులు సహా మహిళలు ఇబ్బంది పడుతున్నారు. సాధారణంగా ఉదయం ఆరు గంటలకే నిద్రలేచే వారు తొమ్మిదైనా ముసుగు తీయడం లేదు. ఇక ఉదయాన్నే ఆఫీసులకు వెళ్లే ఉద్యోగులు, ద్విచక్రవాహనాలపై ప్రయాణించే మార్కెటింగ్ సిబ్బంది చలికి ఉక్కిరిబిక్కిరవుతున్నారు. వాతావరణంలో ఒక్కసారిగా చోటు చేసుకున్న మార్పులతో అనేక మంది శ్వాసకోశ, చర్మ, హృద్రోగ సంబంధ సమస్యలతో బాధపడుతున్నారు. చలి నుంచి ఉపశమనం కోసం వెచ్చదనాన్ని ఇచ్చే ఉన్ని రగ్గులు, దుప్పట్లతో పాటు స్వెట్టర్లు, మఫ్లర్లు, మంకీ క్యాపులు కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. దీంతో వ్యాపారులు వాటి ధరలను అమాంతం పెంచేశారు.

ఆస్తమాతో ఉక్కిరిబిక్కిరి

వాతావరణంలో చోటు చేసుకున్న అనూహ్య మార్పులతో అనేక మంది దగ్గు, జలుబు, ముక్కు దిబ్బడ, ఆస్తమాతో బాధపడుతున్నారు. స్వేచ్ఛగా శ్వాస తీసుకోలేక పోతున్నారు. చర్మం పొడిబారి పగుళ్లు ఏర్పడుతున్నాయి. సరిపడా మంచినీరు తాగక పోవడంతో డీహైడ్రేషన్‌కు లోనవుతున్నారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు ఎక్కువగా వీటి బారిన పడుతున్నారు. ఇప్పటికే హృద్రోగ సమస్యతో బాధపడుతున్న వారు చలి తీవ్రతకు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. రక్తనాళాల్లో రక్తం గడ్డకట్టి తీవ్రమైన గుండెపోటుకు గురువుతున్నారు. ఇటీవల వెలుగు చూస్తున్న మరణాల్లో అత్యధికం ఇవే కావడం గమనార్హం. అత్యవసర పరిస్థితుల్లో సమీపంలోని ఆరోగ్య కేంద్రాలకు చేరుకుంటే.. అక్కడి వైద్యులు చేతులెత్తేస్తున్నారు. 'ఆస్తమా బాధితులతో పాటు హృద్రోగ సంబంధ బాధితులు సాధ్యమైనంత వరకు స్వెట్టర్లు, మఫ్లర్లు ధరించాలని, సూర్యోదయం తర్వాతే వాకింగ్‌కు వెళ్లాలని, కాళ్లు, చేతులు, బుగ్గలు కమిలి పోకుండా ఉండేందుకు మాశ్చరైజర్లను వినియోగించాలి' అని మహేశ్వరం మెడికల్ కాలేజీకి చెందిన ప్రముఖ వైద్య నిపుణుడు డాక్టర్ నాగేందర్ సూచించారు.

తగ్గిన విద్యుత్ వినియోగం

ఉక్కపోత కారణంగా నిన్న మొన్నటి వరకు గిర్రున తిరిగిన మీటర్లు ఒక్కసారిగా స్లో అయ్యాయి. ఏసీలు, కూలర్లు, ఫ్యాన్లు ఆఫ్‌లో ఉండటంతో రోజు సగటు విద్యుత్ వినియోగం గణనీయంగా తగ్గింది. స్నానానికి ఉదయం గ్రీజర్లు, హీటర్లు వాడుతున్నప్పటికీ.. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో ఏసీలు ఆఫ్‌లో ఉండటంతో వినియోగం తగ్గింది. సరఫరాలో హెచ్చుతగ్గులు, తరచూ తలెత్తే సాంకేతిక లోపాలు కూడా తగ్గిపోయాయి. ఈనెల 10న 3,141 మెగావాట్ల డిమాండ్ నమోదు కాగా, ఆదివారం 2,593 మెగావాట్లకు పడిపోయింది.

ఆదివారం రాత్రి నమోదైన ఉష్ణోగ్రతలు

మండలం	ప్రాంతం	ఉష్ణోగ్రత
ఇబ్రహీంపట్నం	ఎలిమినేడు	6.7
షాబాద్	చందనవెల్లి	6.7
ఇబ్రహీంపట్నం	మంగళపల్లి	7.0
శేరిలింగంపల్లి	హెచ్‌సీయూ	7.1
కందుకూరు	రాచలూరు	7.4
జిల్లెడు చౌదరిగూడెం	కాసులాబాద్	7.5
రాజేంద్రనగర్	రాజేంద్రనగర్	8.2
చేవెళ్ల	ధర్మసాగర్	8.5
తలకొండపల్లి	వెల్జాల్	8.7
యాచారం	గున్‌గల్	9.3
శంషాబాద్	పెద్దషాపూర్	9.6
మొయినాబాద్	మొయినాబాద్	9.7
అబ్దుల్లాపూర్‌మెట్	తట్టి అన్నారం	9.8
ఫరూఖ్‌నగర్	షాద్‌నగర్	10.5
బాలాపూర్	మామిడిపల్లి	10.6
మాడ్గుల	అర్కపల్లి	12.9
హయత్‌నగర్	హయత్‌నగర్	13.3
శేరిలింగంపల్లి	హఫీజ్‌పేట్	14.0
రాజేంద్రనగర్	అత్తాపూర్	14.7
శేరిలింగంపల్లి	ఖాజాగూడ కాంప్లెక్స్	15.1
హయత్‌నగర్	ఎన్జీఓస్‌కాలనీ	15.2
సరూర్‌నగర్	రాక్‌టౌన్‌కాలనీ	16.0
గండిపేట్	మణికొండ	17.2
ఆమనగల్లు	ఆమనగల్లు	17.3



మొయినాబాద్‌లో స్వెట్టర్లు, దుప్పట్లు కొనుగోలు చేస్తున్న ప్రజలు

అవస్థలు పడుతున్నాం



గడిచిన నాలుగైదు రోజులుగా చలిగాలులు వీస్తుండటంతో అవస్థలు పడుతున్నాం. పగటి సమయంలో కూడా స్వెట్టర్ ధరించి బయటకు వస్తున్నాం. ద్విచక్ర వాహనంపై ఎక్కడికైనా వెళ్లాల్సి వస్తే చలికి వణుకుతూ వెళ్తున్నాం. ఉదయం 9 గంటలలోపు, సాయంత్రం 6 గంటలు దాటిందంటే చలి పులి వెంటాడుతోంది.

– ఎండీ ఆసిఫ్, ఇబ్రహీంపట్నం

ఆరోగ్యం విషయంలో జాగ్రత్త



చలికాలం జాగ్రత్తలు తీసుకోవాలి. వృద్ధులు, పిల్లలు అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉంటుంది. జ్వరం, జలుబు, దగ్గుతో పాటు చలి గాలులకు కండరాల నొప్పులు వచ్చే ప్రమాదముంది. ఆస్తమా వ్యాధిగ్రస్తులు బయటకు వెళ్తే ఉన్ని దుస్తులు ధరించాలి. వేడి ఆహారం తీసుకోవాలి.

– రాధిక, సూపరింటెండెంట్, ఇబ్రహీంపట్నం ప్రభుత్వాస్పత్రి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

కదం తొక్కి.. నినదించి

- మధ్యాహ్న భోజన కార్మికుల ఆందోళన
- కలెక్టరేట్ ఎదుట 48 గంటల ధర్నా
- నినాదాలతో మార్మోగిన ప్రాంగణం

ఇబ్రహీంపట్నం రూరల్: మధ్యాహ్న భోజన కార్మికులు కదం తొక్కారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట 48 గంటల ధర్నాకు దిగారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినదించారు. వందలాది మంది కార్మికుల నినాదాలతో కలెక్టరేట్ ప్రాంగణం మార్మోగింది. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన పథకం యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు స్వప్న మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న గుడ్ల బిల్లులు వెంటనే చెల్లించాలని, లేదంటే పిల్లలకు గుడ్లు ఇవ్వడం మానేస్తామని తెలిపారు. పెరిగిన ధరలకు అనుగుణంగా పిల్లలకిచ్చే మెనూ చార్జీలు పెంచాలన్నారు. పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని, ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం రూ.10వేల వేతనం అమలు చేయాలని, ప్రతి స్కూల్‌కు గ్యాస్ సిలిండర్లు, అవసరమైన గ్యాస్ సరఫరా చేయాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అక్షయ పాత్ర లాంటి స్వచ్ఛంద సంస్థలకు భోజన బాధ్యతలు ఇవ్వొద్దని, ప్రమాదబీమా, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని కోరారు. ఎలాంటి షరతులు లేకుండా బ్యాంకు రుణాలు ఇవ్వాలని, పబ్లిక్ ఫైనాన్స్ మేనేజ్‌మెంట్ సిస్టం ద్వారా బిల్లులు, జీతాలు చెల్లించాలని కోరారు. సమస్యలు పరిష్కరించేంత వరకు పోరాటం ఆపేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో శ్రామిక మహిళా కన్వీనర్ కవిత, సీఐటీయూ నాయకులు పోచమోని కృష్ణ, ఏర్పుల నర్సింహ, శేఖర్, బాలరాజు, ఎల్లేష్, మధ్యాహ్న భోజనం యూనియన్ జిల్లా అధ్యక్షురాలు అలివేలు, ఉపాధ్యక్షులు గణేశ్, పద్మ, నరేందర్, సహాయ కార్యదర్శి శ్రీను, కోశాధికారి సరిత, ఇతర నాయకులు పాల్గొన్నారు.

హైవే విస్తరణపై కాలయాపన

- ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యంతోనే హైదరాబాద్– బీజాపూర్ రోడ్డు విస్తరణలో జాప్యం
- బీఆర్ఎస్ యువజన రాష్ట్ర నాయకుడు పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కార్తీక్‌రెడ్డి

చేవెళ్ల: హైదరాబాద్– బీజాపూర్ జాతీయ రహదారి విస్తరణపై అడుగడుగునా అబద్ధాలే ప్రచారం చేస్తూ ప్రభుత్వాలు, అధికారులు కాలయాపన చేస్తున్నారని బీఆర్ఎస్ యువజన రాష్ట్ర నాయకుడు పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి అన్నారు. మండలకేంద్రంలో సోమవారం ఆయన డీసీఎంఎస్ చైర్మన్ పి.కృష్ణారెడ్డి, బీఆర్ఎస్ నాయకులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చెన్నై నేషనల్ గ్రీన్ ట్రిబ్యూనల్ (ఎన్జీటీ)లో ఉన్న కేసు విచారణకు కొంతమంది నాయకులతో ఈనెల 13న కలిసి వెళ్లి అసలు నిజాలు తెలుసుకున్నట్టు చెప్పారు. ద్విసభ్య ధర్మాసనం అడిగిన సరైన నివేదికలను ఎన్‌హెచ్ఏఐ అధికారులు అందించకపోవటంతోనే జాప్యం జరుగుతోందని తెలిపారు. ఎన్జీటీ కోర్టు 2023 నవంబర్‌లో క్లియర్‌గా నాలుగు నెలల గడువు ఇచ్చి ఈపీఏ రిపోర్టు సమర్పించాలని, అప్పటి వరకు ఎలాంటి పనులు చేపట్టొద్దని డైరెక్షన్ ఇచ్చిందన్నారు. కానీ అప్పటి ఈ ప్రాంత ఎమ్మెల్యే, ఎంపీలు ఎలాంటి అడ్డంకులు లేవు, రోడ్డు క్లియరెన్స్ వచ్చిందని తప్పుడు ప్రచారం చేసి ప్రజలను తప్పుదోవ పట్టించారని మండిపడ్డారు. కోర్టు అడిగిన ప్రశ్నలకు అధికారుల వద్ద సమాధానం లేదన్నారు. ఇప్పుడు కొత్తగా ఈపీఏతోపాటు మరో జెడ్ఎస్ఐ రిపోర్టు జతచేయాలని కోర్టు కోరడం జరిగిందన్నారు. ఈనెల 16 వరకు మనకు అన్ని క్లియరెన్స్‌లు వస్తాయి, పనులు ప్రారంభిస్తామని హామీలిచ్చిన ప్రజాప్రతినిధులు, అధికారులు ఎలా చేస్తారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రోడ్డు పనులు జరగకుంటే ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని హెచ్చరించారు. సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గం నాయకుడు దేశమొళ్ల ఆంజనేయులు, నియోజకవర్గం యూత్ అధ్యక్షుడు వంగ శ్రీధర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు పి.ప్రభాకర్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

ప్రజావాణి అర్జీలను పెండింగ్‌లో పెట్టొద్దు



ప్రజావాణిలో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రజావాణికి వచ్చే అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా తక్షణమే పరిష్కరించాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఆయన అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణిలో వచ్చే అర్జీలపై సంబంధిత అధికారులు తక్షణమే స్పందించాలన్నారు. ఈ వారం రెవెన్యూ శాఖకు సంబంధించి 52, ఇతర శాఖలకు సంబంధించి 15 మొత్తం 67 వినతులు అందినట్లు తెలిపారు. అనంతరం జిల్లా అధికారులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేశారు. ఇందిరమ్మ ఇంటి సర్వేను ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని, మార్గదర్శకాలను తుచ తప్పకుండా పాటించాలని సూచించారు. తప్పిదాలకు తావు లేకుండా, పక్కగా పూర్తి పారదర్శకంగా వివరాలు సేకరించి ఆన్‌లైన్ యాప్‌లో నమోదు చేయాలన్నారు. కొత్తగా ప్రవేశపెట్టిన డైట్‌ను సంక్షేమ హాస్టళ్లు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో అమలయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, వివిధ శాఖల అధికారులు, మున్సిపల్ అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన గెజిటెడ్ అధికారులు



ఇబ్రహీంపట్నం రూరల్: జిల్లా గెజిటెడ్ అధికారుల అసోసియేషన్ ఆధ్వర్యంలో కలెక్టర్ సి.నారాయణరెడ్డిని సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా అభివృద్ధి కోసం అధికారులంతా కలిసి పని చేయాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రామారావు, కార్యదర్శి శ్రీనేష్ కమార్‌నోరి, అసోసియేట్ అధ్యక్షుడు పీసీ వెంకటేశ్, ట్రెజరర్ శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు గంప శ్రీనివాస్, అలివేలు మంగ, సంయుక్త కార్యదర్శులు అనిత, మంగ, సంయుక్త కార్యదర్శులు అనిత, సుజాత, సైదమ్మ, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ జిల్లా కమిటీ ఎన్నిక



అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోపాల్, వెంకటప్ప

షాద్‌నగర్: పట్టణంలోని ఠాగూర్ ఉన్నత పాఠశాల ఆడిటోరియంలో రెండు రోజులుగా టీఎస్ యూటీఎఫ్ జిల్లా ఆరో మహాసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా సోమవారం నూతన కమిటీని ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడిగా గోపాల్‌నాయక్, ప్రధాన కార్యదర్శిగా వెంకటప్ప, ఉపాధ్యక్షులుగా రాములయ్య, కల్పన, కోశాధికారిగా డాక్టర్ జగన్నథ్ శర్మ, కార్యదర్శులుగా వెంకటయ్య, కిషన్ చౌహాన్, భగవంత్‌రాజ్, రామకృష్ణ, శివారెడ్డి, భువనేశ్వరి, నర్సింలు, బుగ్గరాములు, శ్యామలాదేవి, శంకర్‌నాయక్, మల్లేష్, అక్బర్, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా రఘుపాల్, సభ్యులుగా బుగ్గరాములు, కృష్ణ, ఆంజనేయులు ఎన్నికయ్యారు నూతన కమిటీ రెండేళ్లపాటు కొనసాగుతుందని ఎన్నికల పరిశీలకుడు సీహెచ్ రవి, ఎన్నికల అధికారి యాదయ్య తెలిపారు.

పథకాలను దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలి

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రభుత్వ పథకాలను దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీలత, సంక్షేమ శాఖ అధికారి సంధ్యారాణి అన్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ, జిల్లా సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో సోమవారం సమీకృత కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దివ్యాంగులు పనిచేసే చోట ర్యాంపులు, అవసరమైన సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు. దివ్యాంగుల సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సింహాచారి మాట్లాడుతూ సదరం సర్టిఫికెట్ల జారీలో జాప్యం జరగకుండా చూడాలన్నారు.



దీక్షకు సంఘీభావం తెలిపిన ధర్మసమాజ్ పార్టీ నాయకులు

సమగ్ర శిక్షా ఉద్యోగుల సమస్యలు తీర్చాలి

ఇబ్రహీంపట్నం రూరల్: విద్యాశాఖలో పని చేస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ధర్మసమాజ్ పార్టీ జిల్లా కన్వీనర్ అమరేందర్ డిమాండ్ చేశారు. సమగ్ర శిక్షా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కొద్ది రోజులుగా కలెక్టరేట్ ఎదుట చేపట్టి రిలే దీక్షలు సోమవారం పదో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ధర్మసమాజ్ పార్టీ సంఘీభావం తెలిపింది. జిల్లా కన్వీనర్ అమరేందర్ మాట్లాడుతూ.. సమగ్ర శిక్షా ఉద్యోగులకు పేస్కేల్ ఇవ్వాలని, పర్మినెంట్ చేసి ఆదుకోవాలని, బెనిఫిట్స్ ఇవ్వాలని కోరారు. ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని లేదంటే అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ధర్మసమాజ్ పార్టీ నాయకులు భవాని శేఖర్, నాగార్జున, అంజయ్య, మహిపాల్, లింగస్వామి, భరత్ తదితరులు పాల్గొన్నారు.

'పాలమూరు–రంగారెడ్డి' పూర్తి చేయండి

- ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, వీర్లపల్లి శంకర్



మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యేలు టీఆర్ఆర్, వీర్లపల్లి శంకర్

పరిగి: పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు పనులను ప్రారంభించి త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలకు షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తో కలసి వినతిపత్రం అందజేశారు. ఉద్దండాపూర్ ప్రాజెక్ట్ వరకు నీటిని అందించేందుకు కాల్వల పనులు పూర్తయ్యాయన్నారు. పరిగి, షాద్‌నగర్ ప్రాంతాల్లో దాదాపుగా 80వేల ఎకరాల సాగు నీటి కోసం ఏర్పాటు చేస్తున్న కేపీ లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టు పనులను త్వరగా ప్రారంభించాలన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్‌ను పూర్తి చేస్తామని హామీ ఇచ్చామని.. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు గత ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చేందుకు ఆందోళనలు నిర్వహించామని గుర్తుచేశారు.

ప్రశాంతంగా ముగిసిన గ్రూప్–2

ఇబ్రహీంపట్నం: గ్రూప్–2 పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ముగిసాయి. మండల పరిధిలోని 21 పరీక్ష కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షలకు మొదటి రోజు కంటే రెండోరోజు మరికొంత మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. రెండోరోజు పరీక్షకు 43.83 శాతం మంది మాత్రమే హాజరయ్యారు. 16,584 మంది అభ్యర్థులకుగాను 7,260 మంది హాజరుకాగా 9,324 మంది గైర్హాజరయ్యారు. నిర్ణీత సమయానికి కంటే ఆలస్యంగా పలువురు అభ్యర్థులు సెంటర్‌కు రావడంతో లోనికి అనుమతించలేదు. ఆయా పరీక్ష కేంద్రాల వద్ద మహేశ్వరం అదనపు డీసీపీ సత్యనారాయణ పోలీస్ బందోబస్తును పర్యవేక్షించారు.

హాజరైనవారు అంతంతే..

మొయినాబాద్‌రూరల్: హిమాయత్‌నగర్‌లోని గండిపేట ఎన్‌టీఆర్ కుటీర్ పాఠశాల, చైతన్య డీమ్డ్ టూబీ యూనివర్సిటీ, కేఎల్ యూనివర్సిటీ అజీజ్ నగర్ పరీక్ష కేంద్రాల్లో గ్రూప్–2 పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ముగిశాయి. చైతన్య డీమ్డ్ టూబీ ఇంజనీరింగ్ కళాశాలలో 600 మందికి గాను 169 మంది హాజరయ్యారు. విద్యాజ్యోతి ఇంజనీరింగ్ కళాశాలలో 960 మందికి గాను 259 మంది హాజరు కాగా అమ్డాపూర్ చౌరస్తాలోని జోగిన్‌పల్లి బీఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో 816 మందికి గాను 204 మంది హాజరుకాగా, అజీజ్‌నగర్ సమీపంలోని కేఎల్‌హెచ్ డీమ్డ్ టూబీ యూనివర్సిటీ కళాశాలలో 720 మందికి గాను 183 మంది హాజరయ్యారు. ఆయా కళాశాలల్లో పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించారు.



గురునానక్ సెంటర్‌లో అభ్యర్థుల హాల్‌టికెట్స్, ఐడీలను తనిఖీ చేస్తున్న అధికారులు

పటిష్ట బందోబస్తు

షాద్‌నగర్‌రూరల్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్, విశ్వభారతి కళాశాల, ఠాగూర్ స్కూల్, శ్రీ చైతన్య, బ్రిలియంట్ పాఠశాలలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 2,224 అభ్యర్థులకు గాను ఉదయం 854 మంది హాజరయ్యారు. 1,370 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం 855 మంది హాజరు కాగా 1,369 మంది గైర్హాజరయ్యారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. సమీపంలోని జిరాక్స్ కేంద్రాలను మూసివేయించారు. పరీక్షా కేంద్రాల్లోకి అభ్యర్థులు సెల్‌ఫోన్‌లు, స్మార్ట్ వాచ్‌ల వంటివి తీసుకెళ్లకుండా క్షుణ్ణంగా పరిశీలించి పంపించారు.



మొయినాబాద్‌రూరల్: హిమాయత్‌నగర్‌లోని చైతన్య డీమ్డ్ టూబీ యూనివర్సిటీ కళాశాల సెంటర్‌లో నంబర్లు వెతుక్కుంటున్న అభ్యర్థులు

గర్భిణిని పరీక్ష కేంద్రానికి తరలించిన పోలీసులు

మంచాల: ఇబ్రహీంపట్నం మండలం శేరిగూడ సమీపంలోని శ్రీఇందు ఇంజనీరింగ్ కళాశాలలో పరీక్షకు సోమవారం ఓ గర్భిణి వచ్చింది. కళాశాల గేట్ నుంచి పరీక్ష కేంద్రానికి దూరం ఉండడంతో నడిచి వెళ్తుండగా గమనించిన మంచాల సీఐ మధు తమ వాహనంలో పరీక్ష కేంద్రానికి చేర్చి ఔదార్యం చాటుకున్నారు.



రాష్ట్ర స్థాయిలో షాద్‌నగర్ విద్యార్థుల ప్రతిభ

షాద్‌నగర్‌రూరల్: వరంగల్‌లో నిర్వహించిన టీ10 రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీల్లో షాద్‌నగర్ విద్యార్థులు సత్తా చాటారు. ఈ నెల 14, 15 తేదీల్లో నిర్వహించిన టోర్నీలో పట్టణంలోని ప్రైవేటు పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న ప్రణీత్, వినీత్, సాయి వర్షిత్ పాల్గొన్నారు. ఉత్తమ ప్రతిభ కనబర్చి మూడో స్థానంలో నిలిచారు. వీరు జనవరిలో లక్నోలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ నరేంద్రరాయ్, పీఈటీ కరుణాకర్‌లు తెలిపారు.


జ్ఞాపికలతో విజేతలు

మహిళ మెడలో గొలుసు చోరీ

మీర్‌పేట: నడుచుకుంటూ వెళ్తున్న మహిళ మెడలోని పుస్తెలతాడును చైన్ స్నాచర్లు అపహరించారు. ఈ సంఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. జిల్లెలగూడ జనార్దన్‌నగర్ కాలనీకి చెందిన కొర్ర హరిత(32) సోమవారం సాయంత్రం కుమారుడిని పాఠశాల నుంచి తీసుకొస్తుండగా పల్సర్ బైక్‌పై వచ్చిన ఇద్దరు వ్యక్తులు ఆమె మెడలోని నాలుగున్నర తులాల బంగారు పుస్తెలతాడును తెంచుకుని పారిపోయారు. హరిత కిందపడి అరవగా అప్పటికే స్నాచర్లు పారిపోయారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం


వ్యక్తి మృతదేహం

యాచారం: మండల పరిధి నందివనపర్తి గ్రామంలో సోమవారం రాత్రి గుర్తు తెలియని మృతదేహం లభ్య మైంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామంలోని బస్టాండ్ వద్ద 50 ఏళ్ల వ్యక్తి స్పృహతప్పి పడిపోయాడు. గమనించిన గ్రామస్తులు 108కి సమాచారం అందించారు. అనంతరం పరిశీలించిన సిబ్బంది.. వ్యక్తి మృతి చెందినట్లుగా నిర్ధారించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు నల్లటి స్వెటర్, నలుపు రంగు ప్యాంటు ధరించి ఉన్నట్లు సీఐ నర్సింహరావు తెలిపారు.

మొక్కల పెంపకానికి మొదటి అడుగు

పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోంది. ఊరూవాడా మొక్కలు నాటేందుకు వడివడిగా అడుగులేస్తుంది. దీనిలో భాగంగానే గ్రామాల్లో నర్సరీల ద్వారా మొక్కలను పెంచేందుకు అధికారగణం నిమగ్నమైంది.

- గ్రామాల్లో మొక్కల తయారీకి అధికారుల చర్యలు
- వానాకాలానికి నాటడమే లక్ష్యంగా అడుగులు


రోటిబండ తండాలో కవర్లలో మట్టిని నింపుతున్న కూలీలు

దుద్యాల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా 'వన మహోత్సవం' పేరిట మొక్కలు నాటే కార్యక్రమానికి ప్రణాళికలు రచిస్తోంది. పరిసరాలు పచ్చదనంతో పరిఢవిల్లాలనే ఉద్దేశంతో గ్రామాల్లోని ప్రధాన వీధులు, చౌరస్తాలు, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టనుంది. అందుకు వర్షాకాలం అనువైనదిగా ఎంచుకున్నారు. వర్షాలు పడిన వెంటనే ఆయా ప్రదేశాల్లో మొక్కలు నాటే కార్యక్రమం ప్రారంభిస్తారు. ఈ మేరకు నవంబర్, డిసెంబర్ నెలల నుంచి గ్రామాల్లో నర్సరీల ద్వారా మొక్కలు పెంచుతున్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో మొక్కలకు విత్తనాలు వేసేందుకు ఎర్ర, నల్లమట్టిని జల్లెడ పట్టి వాటి నుంచి సన్నని మట్టిని తీసి ప్లాస్టిక్ ప్యాకెట్లలో నింపుతున్నారు. దానిలో వివిధ రకాలు మొక్కలకు సంబంధించిన విత్తనాలను వేసి నీటిని పడుతున్నారు. మూడు నుంచి ఆరు రోజుల తర్వాత విత్తనం మొలకెత్తుతుంది. అలా మొక్కలను కాపాడుతూ వర్షాకాలం వరకు పెంచి పెద్దగా చేస్తారు. వానలు కురిసినప్పుడు వాటిని నాటుతారు. ఇందుకుగాను పూర్తి ఖర్చులు ప్రభుత్వం ఉపాధిహామీ పథకం ద్వారా అందిస్తుందని సంబంధిత అధికారులు తెలిపారు. అందుకు ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు నర్సరీల నిర్వహణను పర్యవేక్షిస్తుంటారు. ఇటీవల మండల పరిధిలోని ఆలేడ్ గ్రామంలో ఎంపీడీఓ ఉషశ్రీ నర్సరీని పరిశీలించారు. ప్రస్తుతం ఉన్న మొక్కలను జాగ్రతగా కాపాడాలని ఆమె సూచించారు.

గ్రామ పంచాయతీలదే బాధ్యత

నర్సరీల ఏర్పాటు, నిర్వహణకుగాను ప్రభుత్వం ఉపాధిహామీ, గ్రామ పంచాయతీ నుంచి ఖర్చు చేస్తుంది. తక్కువ జనాభా కలిగిన గ్రామాల్లో తక్కువ మొక్కలు పెంచడం, అధిక జనాభా, గ్రామ విస్తీర్ణం ఉన్న గ్రామాల్లో ఎక్కువ మొక్కలు పెంచుతామని అధికారులు చెబుతున్నారు. పెద్ద గ్రామ పంచాయతీలకు 9వేల మొక్కల కంటే పైగా పెంచవచ్చని, చిన్న గ్రామ పంచాయతీలకు కనీసం 9 వేల మొక్కలు తగ్గకుండా పెంచాలని పంచాయతీ కార్యదర్శులు అంటున్నారు. వీటి ఖర్చులు విడతవారీగా వస్తుందని తెలిపారు. విత్తనాలను డీఆర్డీఏ అందిస్తుందని, మొక్కలకు నిత్యం నీళ్లు పట్టేందుకు, వాటి నిర్వహణ చూసేందుకుగాను 100 రోజులకు ఒక ఉపాధిహామీ కూలీ ఉంటారని తెలిపారు. తర్వాత మరొక ఉపాధి కూలీ సహాయంతో నిర్వహణ కొనసాగిస్తామని పంచాయతీ కార్యదర్శులు చెబుతున్నారు.


ఆలేడ్‌లో నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ ఉషశ్రీ (ఫైల్)

రూ.20 వేలకే స్కూటీ అంటూ మోసం..

పోలీసులను ఆశ్రయించిన యువతి

యాచారం: రూ.లక్ష విలువ చేసే స్కూటిని రూ.20 వేలకే ఇస్తామని గుర్తు తెలియని వ్యక్తులు చెప్పిన మాటలను ఆ యువతి నమ్మింది. డబ్బులు సైతం ఇచ్చింది. తీరా డబ్బులు తీసుకున్న వ్యక్తి ఫోన్ స్విచాఫ్ చేయడంతో మోసపోయానని గ్రహించి, సైబర్‌క్రైం పోలీసులకు ఆశ్రయించింది. వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధి మాల్ గ్రామానికి చెందిన హారిణికి.. కొద్ది రోజుల క్రితం ఓ వ్యక్తి ఫోన్ చేసి ఇరవై వేలకే స్కూటిని విక్రయిస్తామని చెప్పాడు. వెంటనే ఫోన్ పే లేదా స్కానర్ ద్వారా డబ్బులు పంపించాలని కోరాడు. దీనిని నమ్మిన ఆమె.. సదరు వ్యక్తి వాట్సప్ ద్వారా పంపించిన స్కానర్‌కు డబ్బులు పంపారు. రోజులు గడిచినా స్కూటీ ఇవ్వకపోవడంతో.. పాటు మరో రూ.3 వేలు పంపిస్తే స్కూటిని మీ ఇంటికి పంపిస్తామని నమ్మించే ప్రయత్నం చేయడంతో మోసపోయానంటూ సోమవారం పోలీసులను ఆశ్రయించింది. డబ్బులు ఇప్పించాలని కోరింది.

పేదల పెన్నిధి ఆర్ కృష్ణయ్య


కృష్ణయ్యకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న బీసీ నేతలు

షాబాద్: బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, పేదల పెన్నిధి ఆర్ కృష్ణయ్య అని బీసీ సేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ అన్నారు. సోమవారం ఢిల్లీలో ఎంపీగా కృష్ణయ్య ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా కృష్ణ, అరుణ్ తదితరులు ఆయనను కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

14 టన్నుల రేషన్ బియ్యం పట్టివేత

ఇబ్రహీంపట్నం: భారీగా రేషన్ బియ్యం పట్టుకున్న సంఘటన ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. కోహెడ క్రాస్ రోడ్డు సమీపంలో గల ప్రేమ్ రైస్ మిల్ పక్కన ఒక షెట్టర్‌లో పీడీఎస్ బియ్యం డంప్ చేసినట్లు సమాచారం రావడంతో పోలీసులు అక్కడికి వెళ్లారు. అనంతరం సోదా చేయగా.. 280 బస్తాల రేషన్ బియ్యం(సుమారు 14 టన్నులు) ఉన్నట్లు గుర్తించారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం మన్నెగూడ వాసి నరేష్.. రేషన్ లబ్ధిదారుల నుంచి బియ్యం కొనుగోలు చేసి, కోళ్ల ఫారాలకు విక్రయించేందుకు ఇక్కడ చాలా కాలంగా దాచినవిగా గుర్తించారు. బియ్యాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు.. సివిల్ సప్లై గోదామునకు తరలించారు. నరేష్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ తెలిపారు. కాగా రైస్‌మిల్లు పక్కన మడిగెలో బియ్యం డంపు చేయడంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.


స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం

సర్పంచులను పట్టించుకోని బీఆర్‌ఎస్

- పెండింగ్ బిల్లుల పాపం గత ప్రభుత్వానిదే
- సర్పంచుల ఆత్మహత్యకు వారే కారణం
- డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి ధ్వజం


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

కడ్తాల్: 'అధికారంలో ఉన్నప్పుడు సర్పంచులను, వారు చేసిన అభివృద్ధి పనుల బిల్లులను పట్టించుకోని నాటి ఆర్థిక మంత్రి హరీశ్‌రావు.. ఇప్పుడు అసెంబ్లీలో బిల్లులపై మొసలి కన్నీరు కారుస్తున్నారు. బిల్లులు చెల్లించకుండా, అప్పులతో సర్పంచ్‌ల ఆత్మహత్యలకు బీఆర్‌ఎస్ ప్రభుత్వమే కారణమయింది' అని డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నాడు బిల్లుల గురించి పట్టించుకోని వారు, ఇప్పుడు అసెంబ్లీ సమావేశాల్లో వాకౌట్ చేయడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. కేంద్ర ప్రభుత్వం నుంచి గ్రామ పంచాయతీలకు వచ్చిన నిధులను దారి మళ్లించి, సర్పంచ్‌లను ఇబ్బందులకు గురిచేసింది వారేనని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రజాపాలనపై గులాబీ నాయకులు ఆరోపణలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్ బిల్లుల సమస్యలను పరిష్కరిస్తుందని వెల్లడించారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు రాములుగౌడ్ ఉన్నారు.

ఆమనగల్లులో..

ఆమనగల్లు: మాజీ సర్పంచ్‌లకు బిల్లులు ఇవ్వకుండా బీఆర్‌ఎస్ మోసం చేసిందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జగన్, పట్టణ అధ్యక్షుడు మానయ్య ఆరోపించారు. పట్టణంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. అధికారంలో ఉన్నప్పుడు సర్పంచులను పట్టించుకోని ప్రతిపక్ష నాయకులు.. ఇప్పుడు వారి తరఫున అసెంబ్లీలో మొసలి కన్నీరు కారుస్తున్నారని విమర్శించారు. సమావేశంలో మార్కెట్ డైరెక్టర్ శ్రీశైలం, మాజీ సర్పంచ్ బలరాం, కాంగ్రెస్ నాయకులు ఖలీల్, వస్పుల శ్రీకాంత్ ఉన్నారు.

భక్తిభావంతో మానసిన ప్రశాంతత


హనుమాన్ భక్తులతో మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

ఆమనగల్లు: భక్తిభావంతో మానసిన ప్రశాంతత లభిస్తుందని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. పట్టణంలోని వెంకటగిరి వేంకటేశ్వర స్వామి దేవాలయంలో సోమవారం హనుమాన్ భక్తుల ఇరుముడుల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అంతకుముందు ఆంజనేయ గురుస్వామి చుక్కా నిరంజన్‌గౌడ్ ఆధ్వర్యంలో హనుమాన్ పూజ, హోమం నిర్వహించారు. అనంతరం మాల ధరించిన భక్తులకు ఇరుముడులు కట్టుకుని.. మద్దిమడుగు ఆంజనేయస్వామి దేవాలయానికి తరలివెళ్లారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు అనురాధ, బీఆర్‌ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు పత్యానాయక్, బాలస్వామి, ప్రశాంత్‌నాయక్, రమేశ్‌నాయక్, ఆనంద్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

తలకొండపల్లి: అనారోగ్యంతో బాధపడుతూ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యాదయ్య(28) ఐదు రోజులుగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్‌ఐ శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. తలకొండపల్లి మండలం చంద్రదన గ్రామానికి చెందిన యాదయ్యకు మూడేళ్ల క్రితం నిడదవెల్లి గ్రామానికి చెందిన మమతతో వివాహం జరిగింది. కొంత కాలంగా ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న యువకుడు.. ఈ నెల 10న భార్య మమతను ఆమె తల్లిగారింట్లో ఉంచి, తిరిగి అదేరోజు రాత్రి చంద్రదనకు వచ్చాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో పెట్రోలు పోసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు కాలిన గాయాలతో ఉన్న యాదయ్యను కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి, అనంతరం మెరుగైన వైద్యం కోసం నగరంలోని గాంధికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ ఈ నెల 15న రాత్రి మృతి చెందాడు. మృతుడి తమ్ముడు శ్రీకాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

షాద్‌నగర్‌రూరల్: అనుమానాస్పద స్థితిలో యాచకురాలు మృతి చెందిన సంఘటన సోమవారం మున్సిపాలిటీ పరిధి చటాన్‌పల్లి బైపాస్ రహదారి సమీపంలో వెలుగు చూసింది. స్థానికుల వివరాల ప్రకారం.. గుర్తు తెలియని మహిళ(35) పట్టణంలోని రైల్వే స్టేషన్‌లో భిక్షాటన చేస్తూ అక్కడే నివసించేది. ఈ నేపథ్యంలో ఆమె మృతదేహం బైపాస్ సమీపంలో లభించింది. సదరు మహిళపై గుర్తు తెలియని వ్యక్తులు అత్యాచారం చేసి హత్యచేశారా, లేక మద్యానికి బానిసై చనిపోయిందా అనే కోణంలో పోలీసులు విచారణ జరుపుతున్నారు.

భోజనం ఎలా ఉంది?

బొంరాస్‌పేట: పిల్లలూ.. మన పాఠశాలలో మధ్యాహ్న భోజనం బాగుందా..? అంటూ ఎంఈఓ హరిలాల్ మండల పరిధిలోని టేకులగడ్డతండాలో విద్యార్థులను అడిగారు. సోమవారం ఎంఈఓ పలు పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం పథకం అమలులో మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందిస్తున్నారా? లేదా అంటూ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చిన్నారులతో మాట్లాడారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్
- 20 నుంచి జీపీ కార్మికుల సమ్మె


సమ్మె నోటీసు అందజేస్తున్న శ్రీనివాస్

తాండూరు రూరల్: పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 20వ తేదీ నుంచి సమ్మె నిర్వహిస్తామని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం సమ్మె నోటీసును తాండూరు ఎంపీడీఓ కార్యాలయ సిబ్బందికి అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. తెలంగాణ గ్రామ పంచాయతీ ఉద్యోగ కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో కార్మిక సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కకు వినతిపత్రం అందజేశామన్నారు. మల్టీ పర్పస్ వర్కర్లకు సంబంధించిన జీఓ 51ను సవరించాలని కోరారు. పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలన్నారు. కార్మికులకు ఉద్యోగ భద్రతతో పాటు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. మంగళవారం చలో హైదరాబాద్‌కు తరలిరావాలని కార్మికులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కార్మికులు నర్సింలు, వెంకట్, అంబరప్ప తదితరులు ఉన్నారు.

ఆటోకు నిప్పంటించిన దుండగులు


కాలిబూడిదైన ఆటో

పూడూరు: ఇంటి ఎదుట నిలిపిన ఆటోకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించారు. ఈ ఘటన చన్గోముల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్‌ఐ మధుసూదన్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని చీలాపూర్ గ్రామానికి చెందిన జాంగీర్ తన ఆటోను ఇంటి ఎదుట పార్క్ చేసి విశ్రాంతి తీసుకుంటున్నాడు. ఈ క్రమంలో ఆటో నుంచి మంటలు ఎగిసిపడుతుండడంతో గమనించిన గ్రామస్తులను జాంగీర్‌కు చెప్పి మంటలార్పేందుకు యత్నించారు. కాగా అప్పటికే ఆటో కాలి బూడిదైంది. సోమవారం బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తాళం వేసిన ఇళ్లలో చోరీ

బంగారు నగలు, నగదు అపహరణ


చెల్లా చెదురుగా ఉన్న సామగ్రిని పరిశీలిస్తున్న సీఐ కాంతారెడ్డి

షాబాద్: తాళం వేసిన రెండు ఇళ్లలో దుండుగులు చొరబడ్డారు. నగదు, నగలతో ఉడాయించారు. ఈ సంఘటన షాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. సీఐ కాంతారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రం షాబాద్‌కు చెందిన కొండ సుధీర్‌కు చెందిన ఇంటి తాళాలను దొంగలు పగులగొట్టి బీరువాలోని తులం బంగారం, 4 కిలోల వెండిని ఎత్తుకెళ్లారు. అదే ప్రాంతానికి చెందిన రాహుఫ్.. కుమారుడి పెళ్లి నిమిత్తం బంగారం ఆభరణాలు, ఇతర సామగ్రి ఇంట్లో పెట్టి హైదరాబాద్‌కు వెళ్లారు. ఇది గుర్తించిన దుండగులు.. ఇంటి తాళాలు పగులగొట్టి.. బీరువాలోని 7 తులాల బంగారం, రూ.7లక్షల నగదును అపహరించారు. అదే ప్రాంతానికి చెందిన మరో వ్యక్తి యాదగిరి టీవీఎస్ ఎక్సెల్ మోటర్‌సైకిల్‌ను దొంగిలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఇళ్లను పరిశీలించిన పోలీసులు.. క్లూస్‌టీంతో దుండగుల ఆధారాలను సేకరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

డీజిల్ ట్యాంకర్ సీజ్


టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్న డీజిల్ ట్యాంకర్

పరిగి: కర్ణాటక నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా డీజిల్ తరలిస్తున్న ట్యాంకర్‌ను టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. కర్ణాటక నుంచి నగరానికి సుమారుగా ఆరు వేల లీటర్ల డీజిల్‌ను ఆదివారం రాత్రి తరలిస్తుండగా టాస్క్ ఫోర్స్ పోలీసులు పరిగిలో పట్టుకుని పరిగి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఎలాంటి అనుమతులు లేకపోవడంతో ట్యాంకర్‌ను సీజ్ చేశరు. కర్ణాటకలో మన రాష్ట్రం కన్నా లీటర్ డీజిల్ సుమారు రూ.10 ధర తక్కువగా ఉండడంతో ఈ అక్రమార్కులు ఈ దందాకు తెరలేపారు. నగరానికి ఒక్క ట్యాంకర్ తీసుకువస్తే రూ.లక్షకు పైగా అక్రమంగా ఆర్జిస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో ధనుర్మాస పూజలు


విశేష అలంకరణలో స్వామివారు

కొడంగల్ రూరల్: పట్టణంలోని శ్రీమహాలక్ష్మీ వేంకటేశ్వర స్వామివారి దేవాలయంలో ధనుర్మాసం పూజలు సోమవారం వేకువజాము నుంచి ఆలయ అర్చకులు, ధర్మకర్తలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థానంలో నిర్వహించే కార్యక్రమాల మాదిరిగానే స్థానిక ఆలయంలో ఆగమ శాస్త్ర పద్ధతిలో సంప్రదాయబద్ధంగా నిర్వహించడం విశేషం. సుప్రభాతం నుంచి ఏకాంత సేవ వరకు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు తెలిపారు. సూర్యుడు ధనస్సు రాశిలో ప్రవేశించిన సందర్భాన్ని పురస్కరించుకొని ధనుర్మాసం ప్రారంభం అవుతుందన్నారు. ఉదయం 4 గంటలకు వాయిద్యం, 5 గంటలకు సుప్రభాతం, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆలయ పండితులు శ్రీమాన్ ధరూర్ శ్రీనివాసాచార్యులు తిరుప్పావైలోని మొదటి అధ్యాయాన్ని చదువుతూ గోదాదేవి అమ్మవారు చేసిన వ్రత విధానాన్ని భక్తులకు వివరించారు. భక్తులకు అర్చకులు తీర్థప్రసాదాలు అందించారు.